క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి కృషి



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని బీరయ్యస్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు రూ. 10 లక్షలు టీటీడీ నుంచి మంజూరు కాగా, శుక్రవారం అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఆలయానికి నిధులు మంజూరు చేయడానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల: కోరుట్ల పట్టణానికి చెందిన సాజిద్ అలీ ఇటీవల మృతి చెందగా గాయత్రి కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో నిర్భయ సేవింగ్ ఖాతాపై ప్రమాదబీమా ఉండగా అందుకు సంబంధించిన చెక్కును బ్యాంక్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే సంజయ్ బాధిత కుటుంబ సభ్యులకు శుక్రవారం అందజేశారు.రూ.లక్ష విలువ గల ప్రమాద బీమా ఉన్నట్లు బ్యాంకు అధికారులు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్లు వితరణ



కంప్యూటర్లు అందజేస్తున్న అంగడి ఆనంద్

మేడిపల్లి: భీమారం మండలం ఏర్పడి సుమారు రెండేళ్లయినా సదుపాయాలలేమితో ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. తహసీల్దార్ కార్యాలయంంలో కేవలం ఒకే ఒక కంప్యూటర్‌తో పనులు నిర్వహించడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో మండలంలోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు, మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి కంప్యూటర్లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవి కిరణ్, ఆర్.ఐ రాజరాం, మాజీ సర్పంచులు బొంగొని రాజగౌడ్, బాలసాని లహరిక మారుతి,దే మాజీ ఎంపిటీసి రాజరెడ్డి, టాఫ్స్ అధ్యక్షుడు బంగారు దీపక్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయ అభివృద్ధికి కృషి



కిషన్‌రావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ

రాయికల్: మండలంలోని మైతాపూర్ దుర్గామాత ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని యాటమ్ కిషన్ రావు తెలిపారు. మండలంలోని మైతాపూర్ గన్నేగుట్ట పై ఉన్న దుర్గామాత ఆలయాన్ని సందర్శించి మాట్లాడారు. రాజ్యసభ ఎంపీ దామోదర్ రావు సహకారంతో రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేయిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రావు దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంగ మల్లయ్య, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి అమర్, కోశాధికారి బేతి రాజు గ్రామ నాయకులు పాల్గొన్నారు

వరద కాల్వకు 12 వేల క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి వరదకాల్వకు శుక్రవారం 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 34, 221 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ మెయిన్ కెనాల్‌కు 6800 క్యూసెక్కులు, లక్ష్మి కెనాల్‌కు 150 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్టు 4 గేట్లను ఎత్తి, నీటిని గోదావరిలోకి వదిలారు.



బతుకమ్మతో సంబరాలు



బతుకమ్మ పండగ అంటేనే మహిళలకు సంబరం లాంటిది. బతుకమ్మ పండగ వచ్చిందంటే సాయంత్రం నుంచి బతుకమ్మ ఆటలాడుతూ ఎంతో ఆనందంగా గడుపుతాం. అందరం ఒకచోట కలిసి బతుకమ్మ ఆడుతాం. తెల్లవారు నుంచే పూలను సేకరించి బతుకమ్మ ఆటలాడుతాం.

– జిల్లా లావణ్య, ఆర్యవైశ్య పట్టణ మహిళా అధ్యక్షురాలు, రాయికల్

పండగ వాతావరణం



బతుకమ్మ అంటేనే పల్లెల్లో, పట్టణాల్లో మహిళలకు పండగ వాతావరణం నెలకొంటుంది. ఎంగిలి పూల బతుకమ్మ నుంచి నిమజ్జనం చేసేంత వరకు బతుకమ్మ పండగను మహిళలు ప్రతిరోజు ఘనంగా నిర్వహిస్తూ రాత్రుల పూట నిమజ్జనం చేస్తాం.

– పటేల్ సంధ్యారాణి, రాయికల్

గౌరమ్మ పూజలు నిర్వహిస్తాం



బతుకమ్మ అంటేనే గౌరీదేవి గుర్తుకు వస్తుంది. బతుకమ్మలో గౌరమ్మను ప్రతిష్ఠించి తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులంతా ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ గౌరీదేవికి పూజలు నిర్వహిస్తాం. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి బతుకమ్మ సంబరాలు జరుపుకుంటాం.

– సిద్దంశెట్టి స్వప్న,రాయికల్



మెట్‌పల్లిలో మహిళల కుంకుమపూజ



గొల్లపల్లిలో భక్తుల పూజలు



బోర్నపెల్లి లో పూజలు చేస్తున్న భక్తులు



మల్లాపూర్ వాసవీ కన్యక పరమేశ్వరి ఆలయంలో పూజలు



పెగడపల్లిలో..



బీర్‌పూర్‌లో గాయత్రిదేవి అలంకారంలో అమ్మవారు

బ్రహ్మచారిణి గా అమ్మవారు

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/మెట్‌పల్లి/రాయికల్/మల్లాపూర్/పెగడపల్లి/గొల్లపల్లి/సారంగాపూర్: జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రులు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం 2వ రోజు అమ్మవారు బ్రహ్మచారిని, గ్రాయత్రీ మాత రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు.భక్తులు, భవానీ దీక్షాదారులతో మంటపాలు కిటకిటలాడాయి. పలు చోట్ల కుంకుమపూజలు, ప్రత్యేక పూజలు చేశారు.



ధర్మపురిలో బ్రహ్మచారిణి అవతారంలో..



లక్ష్మీపూర్‌లో గాయత్రి మాత అలంకరణలో దుర్గాదేవి



ధర్మపురిలో విద్యార్థినుల బతుకమ్మ సంబరాలు



రాయికల్ కళాశాలలో..

బతుకమ్మ సంబరాలు

జగిత్యాల/రాయికల్/ధర్మపురి: జగిత్యాల జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో,రాయికల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో,ధర్మపురి పట్టణంలోని పలు కాలనీల్లో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు.



జగిత్యాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

రత్నాకర్‌రావు ఆశయాలు కొనసాగించాలి

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి: పేదలు, రైతుల సంక్షేమ కోసం తపించిన గొప్ప వ్యక్తి రత్నాకర్‌రావు అన్ని, ఆశయాలను కొనసాగించాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. దివంగత మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు జయంతి వేడుకలను శుక్రవారం ధర్మపురిలో ఘనంగా నిర్వహించారు. ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ .రత్నాకర్‌రావు తనకు ఆత్మీయ అనుబంధముందని గడిచిన ఎన్నికల్లో ఓటమిని చవి చూసినప్పటికి మనో ధైర్యాన్ని కల్పించిన గొప్ప వ్యక్తని కొనియాడారు.



నివాళి అర్పిస్తున్న ప్రభుత్వ విప్, నాయకులు

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడికి ఆస్పత్రి వైద్య ఖర్చుల కోసం స్థానిక శ్రీ వాణి విద్యాలయం, ఆంగ్లోవేదిక్ కాన్వెంటు స్కూల్ యాజమాన్యాల ద్వారా 65 వేల రూ.లను జమ చేసి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, ఎస్ దినేష్, చిలుముల లక్ష్మణ్, కస్తూరి శ్రీనివాస్, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రాపర్తి నర్సయ్య, ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ధర్మపురి పట్టణంలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ చేతులు మీదుగా ప్రారంభించారు.

స్వయం ఉపాధితో మహిళా సాధికారికత

• చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల: స్వయం ఉపాధితో మహిళా సాధికారికత సాధ్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని ముత్యంపేటలో స్వశక్తి సంఘం మహిళా రూప నిర్వహించే క్యాంటీన్‌ను దిగువ కొండగట్టులో శుక్రవారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారిత సాధించేందుకు ప్రభుత్వం మహిళలకు స్వయం ఉపాధి పథకాలకు ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో చరణ్ దాస్, డీపీఎం విజయ భారతి, ఎంపీడీఓ స్వాతి, ఎంపీఓ ప్రవీణ్, ఏపీఎం రాజయ్య, సీసీలు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అంజలి,వీఓఏ సుమలత, నాయకులు పాల్గొన్నారు.

కొండగట్టు: మహిళల అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీ పలు పథకాలను తీసుకువచ్చిందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. కొడిమ్యాల మండల కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో స్వరూప, నాయకులు పాల్గొన్నారు.



క్యాంటీన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

క్రికెట్ టోర్నీ ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్యాలలోని ఎంఎస్ వారియర్స్ క్రికెట్ టోర్నమెంట్‌ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కొద్దిసేపు బ్యాటింగ్ చే శారు. కార్యక్రమంలో దొంగ ఆనంద రెడ్డి దారం ఆదిరెడ్డి,మాజీ జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, బత్తిని శ్రీనివాస్ గౌడ్, రాంలింగారెడ్డి, శనిగరపు తిరుపతి, హరినాథ్, తహసీల్దార్ మునీందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక



ప్రతిభ చాటిన విద్యార్థులతో కోచ్‌లు

కోరుట్ల: పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాలలో ఇంటర్ చదవుతున్న బొండ నందిని అండర్ –19 స్థాయి త్వైకాండో కరాటే పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గోల్డ్‌మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. త్వైకాండోలో ప్రతిభ చూపిన బొండ నందినిని కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేశ్ అభినందించారు.

విద్యార్థినికి అభినందనన

పట్టణంలోని లిటిల్ జీనియస్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని రిషిత తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన ఈ పోటీల్లో ఫైటింగ్ విభాగంలో సత్తా చాటి బంగారు పథకాన్ని గెలుచుకుంది.ఈ నెల 17న గద్వాల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననుంది.పోటీల్లో సత్తాచాటిన రిషితను తైక్వాండో క్లబ్ వ్యవస్థాపకుడు మాస్టర్ రమేశ్, కరస్పాండెంట్ మహదేవ్,ప్రిన్సిపాల్ రాధాకృష్ణ అభినందించారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ధర్మపురి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై సూర్యనారాయణ రాజు సూచించారు. మండలంలోని మగ్గిడిలో శుక్రవారం సాయంత్రం సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళా బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానవ అక్రమ రవాణ, షీటీమ్, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాలు, యువత గంజాయి, మత్తు పదార్థాల బారిన పడకుండా ఉండేందుకు కళాకారులు తమ పాటల ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతరం ఏఎస్సై రాజు మాట్లాడుతూ.. ఈమధ్య కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగాయని వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. ఎవరైన మోసపోయినట్‌లెతై 1930, 100 కు ఫోన్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులున్నారు.



మాట్లాడుతున్న ఏఎస్సై సూర్యనారాయణ రాజు

ఉపాధిహామీ సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాలలోని రైతులు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని అమ్మక్కపేట , బర్థీపూర్ గ్రామాల్లో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఉపాధి పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో ఏమేమి పనులు చేపట్టవచ్చొ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో కొమరయ్య, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ధాన్యం పోస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని అన్ని గ్రామాల్లో రోడ్ల పక్కన ధాన్యం ఆరబెట్టడం గాని, ధాన్యం కుప్పలు పోయడం గాని రైతులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపారు. రోడ్లపక్కన ధాన్యం పొయడం వలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, ఎవరైన ధాన్యం పోస్తే చట్టరీత్యా చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామని తెలిపారు.

బీఎల్‌వోలకు కిట్లు పంపిణీ

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మండలంలోని బీఎల్‌వోలకు బీఎల్‌వో కీట్లను తహసీల్దార్ ప్రసాద్ పంపిణీ చేశారు. అనంతరం సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితాలలో ఒక్కొక్క బీఎల్‌వో చనిపోయిన వారిని ఎంత మందిని గుర్తించారు, అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఆర్ఐలు రమేశ్, రేవంత్‌రెడ్డి, మండల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

బీజేపీ నూతన సభ్యత్వ నమోదు

గొల్లపల్లి: మండలంలోని మల్లన్నపేటలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వరంలో భారీగా చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రజాధారణ పొందిన పార్టీ బీజేపీ అని, ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశ ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కట్ట మహేశ్, జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం,కస్తూరి సత్యం తదితరులున్నారు.

రైతు ధర్నాకు భారీ బందోబస్తు

జగిత్యాలక్రైం: రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్నాకు పిలుపునివ్వగా, పోలీసులు భారీ బందోబోస్తు ఏర్పాటు చేసారు. ధర్మపురి రూట్లో పెర్కపల్లి చౌరస్తా వద్ద, గొల్లపల్లి రూట్లో తిమ్మాపూర్ చౌరస్తా వద్ద, కరీంనగర్ రూట్లో ధరూర్ బ్రిడ్జి వద్ద, నిజమాబాద్ రూట్లో మంచినీళ్ల బావి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

బుగ్గారం: మండలంలోని మద్దునూర్ గ్రామానికి చెందిన ముంజాల మనోహర్‌గౌడ్ శుక్రవారం తాటి చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలివిధంగా ఉన్నాయి. మనోహర్‌గౌడ్ తన వృత్తిలో భాగంగా కల్లు గీయడానికి తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు తెగిపోయి చెట్టుపై నుంచి కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. స్థానికులు విషయాన్ని గమనించి వెంటనే 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

6న మైనార్టీ హక్కుల సదస్సు

కోరుట్ల: పట్టణంలోని సీఎంఎస్ గార్డెన్‌లో ఈ నెల 6వ తేదీన మైనార్టీల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మైనార్టీ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాజుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముజాహిద్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ ఈ సదస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ అమేర్‌ఖాన్ పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సు విజయవంతం చేయాలని కోరారు.

జగిత్యాల నుంచి కడెంకు ఆర్టీసీ బస్సు

రాయికల్: జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మండలంలోని బోర్నపల్లి గ్రామం వరకు నడిపేవారు. ఇదే బస్సును శుక్రవారం నుంచి నిర్మల్ జిల్లా కడెం వరకు నడుపుతున్నట్లు జగిత్యాల డిపో మేనేజర్ సునీత తెలిపారు. జగిత్యాల, నిర్మల్ జిల్లాల ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

పెగడపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతునకు నిధులు మంజూరు చేసినట్లు ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎనిమిది పనులకు గానూ రూ. 15.86 లక్షలు మంజూరు చేశామన్నారు. రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వ విప్‌కు మండల కాంగ్రెస్ శ్రేణులు, ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వరి కోతలు షురూ

పెగడపల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి కోతలు మొదలయ్యాయి. మండల వ్యాప్తంగా సుమారు 26 వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వరి పంట కోతకు రావడంతో రెండు రోజులుగా రైతులు హార్వేస్టర్ల సహాయంతో కోతలు ప్రారంభించారు. కోసిన ధాన్యాన్ని వెంట వెంటనే ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంటను తరలిస్తున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల స్థలాలను చదును చేసి రైతులకు అవసరమగు సౌకర్యాలు కల్పించాలని మండల రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'ఫ్రెషర్స్' హంగామా



మల్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఇంటర్ మీడియేట్ జిల్లా అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ మోతె శివరామకృష్ణ, ఎస్టీవో తిరుపతి, అధ్యాపకులు అత్తినేని శ్రీనివాస్, శ్రీవాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేయకుండానే వెళ్లిపోయిన మంత్రి

మెట్‌పల్లి: పట్టణంలోని 12 వార్డులో అయ్యప్ప ఆలయం నుంచి డంప్ యార్డు వరకు రూ.1.11కోట్లతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేయకుండానే వెళ్లిపోయారు. శుక్రవారం ఈ పనులకు శంకుస్థాపన చేయించడానికి మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కోరుట్లలో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి..అనంతరం నిజామాబాద్‌కు వెళ్తూ మార్గమధ్యంలో అయ్యప్ప ఆలయం వద్ద కొద్దిసేపు ఆగారు. అక్కడ స్థానికుల నుంచి వినతిపత్రం తీసుకున్న మంత్రి ఆ తర్వాత శంకుస్థాపన చేయకుండానే వెళ్లిపోయారు.

బీర్‌పూర్ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పల్లకిసేవ

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమ్మవారు, స్వామివార్లకు పల్లకిసేవ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం ఆలయం చుట్టు భక్తులు స్వామివారిని, అమ్మవార్లను పల్లకిపై ఆసీనులను చేసి ప్రదక్షిణలను పూర్తి చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు వొద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, భక్తులు పాల్గొన్నారు.



పల్లకి సేవలో అర్చకులు, సిబ్బంది, భక్తులు